ప్రజాశక్తి
మంగళవారం 15 ఆగస్టు 2023
5
అల్లూరి సీతారామరాజు



అల్లూరి జిల్లాను జోన్-1లోనే ఉంచాలి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఉద్యోగ నియామకాలు, బదిలీలకు సంబంధించి ప్రభుత్వం కొత్తగా తీసుకు రాబోతున్న జోన్ల వ్యవస్థలో అల్లూరి జిల్లాను విశాఖపట్నం ఉండే జోన్ లోనే ఉంచాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బిటిఎ) జిల్లా అధ్యక్షుడు వి.వెంకటరమణ డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో సోమవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ప్రభుత్వం తీసుకు రాబోతున్న కొత్త ప్రతిపాదిత ఆరు జోన్ ల వ్యవస్థలో అల్లూరి జిల్లాను కాకినాడ జోన్‌లో పెట్టడం పాడేరు ఏజెన్సీలోని గిరిజన ఉద్యోగులకు ఆందోళనకు కలిగిస్తోందని తెలిపారు. జోన్-1 లోనే అల్లూరి జిల్లాను ఉండేలా చూడాలని, గిరిజన ఉద్యోగుల రిజర్వేషన్లకు నష్టం జరగకుండా చూడాలని కోరారు. అల్లూరి జిల్లాను జోన్-1 నుంచి జోన్-2లోకి మార్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లాను జోన్-1లోనే కొనసాగిస్తేనే ఆదివాసీలకు మేలని పేర్కొన్నారు. అల్లూరి జిల్లాను జోన్-2లో కలపాలని ప్రతిపాదించడం ఆదివాసి ప్రాంత ఉద్యోగులకు అన్యాయం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

- జాతీయ జెండాను ఆవిష్కరించనున్న కలెక్టర్ - సాంస్కృతిక ప్రదర్శనలు, శకటాలు, స్టాళ్ల ఏర్పాటుకు సన్నద్ధం



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహణకు సిద్ధమైంది. పంద్రాగస్టు..జిల్లాస్థాయి వేడుకల నిర్వహణకు జిల్లా కేంద్రం పాడేరులోని తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల మైదానాన్ని ముస్తాబు చేశారు. ఈ వేడుకల్లో జిల్లా ఇన్చార్జి మంత్రి గుడివాడ అమర్నాథ్, కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం పలు శాఖల్లో ప్రభుత్వం సాధించిన ప్రగతిపై ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. జిల్లా ఎస్పీ అతుల్ సింగ్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ సోమవారం సాయంత్రం ఏర్పాట్లను పర్యవేక్షించారు. మైదానంలో పోలీసుల కవాతుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. ముఖ్య అతిథులు ఆసీనులయ్యేందుకు వేదిక ప్రాంగణం ముస్తాబు చేశారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నివేదికను ఇప్పటికే సిద్ధం చేశారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొంటారు. శకటాల రూపకల్పన..మరోవైపు సాయుధ బలగాల కవాతు.. ఇంకోవైపు వివిధలు, వీక్షకులను దృష్టిలో ఉంచుకొని మైదానంలో ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. గత నాలుగు రోజులుగా సాయుధ దళాల కవాతు సాధన చేశాయి. ఆహూతులను ఆకట్టుకునేలా, దేశభక్తి ఉట్టిపడేలా పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో నిర్వహించనున్న సాంస్కృతిక ప్రదర్శనలను సిద్ధం చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రదర్శించే శకటాలు సిద్ధమయ్యాయి. మరోవైపు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన కలిగించే విధంగా పలు స్టాళ్లను ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ శాఖలు అభివృద్ధిని వివరిస్తూ స్టాళ్లలో చిత్రాలు, ఫ్లెక్సీలను ప్రజలు వీక్షించే విధంగా ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆహ్వాన పత్రికలను ప్రోటోకాల్ ప్రకారం పంపిణీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు ఇవ్వడం ఆనవాయితీ. ఈసారి సైతం ప్రతిపాదనలు పంపించాలని ఆయా శాఖల అధికారులకు సమాచారం ఇవ్వగా వారి పేర్లను కలెక్టరేట్‌కు పంపించారు. జిల్లా అధికారులతో పాటు ఆయా శాఖలో కింది స్థాయిలో సేవలందించిన వారి జాబితా రూపొందించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో మువ్వన్నెల జెండా ఎగురనున్నది. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ ఆదేశాలతో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని తలారిసింగి జిటిడబ్ల్యు ఆశ్రమ బాలుర పాఠశాల హెచ్ఎం రీమలి జాన్ అన్నారు. పాఠశాల మైదానంలో స్వాతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సోమవారం ప్రజాశక్తితో మాట్లాడారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా గ్రౌండ్ సిద్ధం చేశారని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, వేడుకలను తిలకించేందుకు హాజరయ్యే ప్రజానీకానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారని పేర్కొన్నారు. వేడుకలను పురస్కరించుకుని ఇప్పటికే అధికారులు అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు.



పరేడ్ రిహార్సల్స్ చేస్తున్న పోలీసులు

300 మీటర్ల జెండాతో ర్యాలీ

ప్రజాశక్తిపాడేరు: ఎందరో స్వాతంత్ర సమరయోధుల త్యాగ ఫలితంగా మనం స్వాతంత్ర్య ఫలాలు పొందుతున్నామని అరకు శాసన సభ్యులు చెట్టి పాల్గుణ అన్నారు. సోమవారం తలారిసింగి ఆశ్రమ పాఠశాల వద్ద జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, అరకు శాసన సభ్యులు చెట్టి పాల్గుణ, ఐటిడి ఏ పి.ఓ వి.అభిషేక్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ అంబేద్కర్ కూడలి వరకు సాగింది. అంబేద్కర్ కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఆజాదీకా అమృత మహోత్సవం హర్ ఘర్ తిరంగాలో భాగంగా తలారిసింగి ఆశ్రమ పాఠశాల నుండి అంబేద్కర్ కూడలి వరకు మూడు వందల మీటర్ల భారీ జాతీయ పతాకంతో నిర్వహించిన ర్యాలీలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు, మగ్రికామయ్య, వీరయ్యదొర, మల్లుదొర, ఘంటం దొర సేవలను స్మరించుకోవాలన్నారు. ఐటిడిఏ పి ఓ వి.అభిషేక్ మాట్లాడుతూ, బిర్సా ముండా, ముర్ము సహోదరులు, సిద్ధుకాను, నీలంబర్ పీతాంబర్, భగత్ సింగ్, గాంధీజీ, నెహ్రూజీ, పండుపడాల్ వంటి వారు జీవితాలను త్యాగం చేసి స్వాతంత్ర్యం సాధించారన్నారు.మనందరం దేశం కోసం ప్రజల కోసం సేవలందించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకరరావు, ఎం. వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఐటిడిఏ పరిపాలనాధికారి హేమలత, ఎఎఓ శ్రీనివాస కుమార్, ఎటిడబ్ల్యూఓ ఎల్.రజని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. జాన్, నెం.1 పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున విద్యార్థులు

జాతీయ జెండాల పంపిణీ

పాడేరు: ఐటిడిఏ లో పరిధిలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు, ఉద్యోగులకు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఐటిడిఏ కార్యాలయంలో సోమవారం జాతీయ పతాకాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆజాదీకా అమృత్ మహోత్సవం హర్‌ఘర్ తిరంగాలో భాగంగా ప్రతీ ఇంటిపైనా జాతీయ జెండాలను ఎగుర వేయాలన్నారు. జాతీయ పతాకాలను ప్రతీ ఒక్కరు గౌర వించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఇంటింటిపైనా జాతీయ జెండాను ఎగురవేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకరరావు, ఎం.వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండల రావు, ఇఇ డి.వి.ఆర్. ఎం.రాజు,పంచాయతీ రాజ్ ఇఇ టి.కొండయ్య పడాల్, ఐటిడిఏ పరిపాలనాధికారి హేమలత, పి.హెచ్.ఓ ఎన్.అశోక్, గురుకులం ప్రిన్సిపాల్ మూర్తి పాల్గొన్నారు.



కిట్లు అందజేస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

ప్రతి మండలానికీ ఆధార్ సెంటర్ ఏర్పాటు

- ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి రంపచోడవరం

ఏజెన్సలోని మారుమూల గ్రామాలలో ప్రజలకు ఆధార్ సేవలు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రతి మండలంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఐదు ఆధార్ కేంద్రాలకు సంబంధించిన కిట్లను సంబంధిత అధికారులు ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ అందజేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్లోని 11 మండలాల్లో ప్రజలకు ఆధార్ కార్డులు ఇబ్బందులు లేకుండా 11 ఆధార్ సెంటర్లు పని చేస్తున్నాయని, మరో ఐదు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీని కోరగా, అందుకు సంబంధించిన కిట్లు రావడం జరిగిందని చెప్పారు. 11 మండలాలలో ఇకనుండి 16 ఆధార్ సెంటర్లు పనిచేస్తాయన్నారు. ఏజెన్సీలోని ప్రజలందరూ ఈ ఆధార్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె.కోటేశ్వరరావు, రీజినల్ ఆధార్ సెంటర్ కో-ఆర్డినేటర్ వి.డేవిడ్ కమలాకర్, డివిజనల్ కో-ఆర్డినేటర్ బి.డేవిడ్, ఆపరేటర్లు పాల్గొన్నారు.

సింగపూర్ రెడ్ క్రాస్ బృందం పర్యటన

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో సింగపూర్ రెడ్ క్రాస్ బృందం మారుమూల గ్రామాల్లో పర్యటించి గిరిజనులకు మౌలిక సదుపాయాలపై ఆరా తీసింది. సింగపూర్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా మారుమూల గ్రామాలతో విద్యుత్, తాగునీటి సదుపాయాల కల్పనకు నవంబర్‌లో చర్యలు చేపడుతున్నారు. రెండు రోజల పర్యటనలో భాగంగా పెదబయలు, పాడేరు, హుకుంపేట మండలాలలోని పలు మారుమూల గ్రామాల్లో పర్యటించి గిరిజనుల స్థితిగతులను స్వయంగా పరిశీలించారు. అనంతరం సోమవారం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పర్యటన వివరాలను వివరించారు. జిల్లాకు సింగపూర్ రెడ్ క్రాస్ బృందం సహాయ సహకారాలు అందిస్తున్నందుకు అభినందించారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడి విశాఖ జిల్లా చైర్మన్ డాక్టర్ వై శివ నాగేంద్ర రెడ్డి, సింగపూర్ రెడ్ క్రాస్ బృందం సత్యనారాయణ, డానియల్, అనకాపల్లి కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, పాడేరు కోఆర్డినేటర్ లోహితస్, సభ్యులు సూర్యారావు, జయలక్ష్మి పాల్గొన్నారు.



కలెక్టర్‌ను కలిసిన బందం సభ్యులు



ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ఫేషియల్ రికగ్నైజెడ్ యాప్‌ను రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-చింతూరు

అంగన్వాడీ కార్యకర్తలకు ఆన్‌లైన్ పేరుతో పని భారాన్ని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఫేషియల్ రికగ్నైజ్‌డ్ యాప్‌ని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన అంగన్వాడీలు సోమవారం చింతూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ సరైన నెట్ సదుపాయం లేని ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోకుండా నెలలో రెండుసార్లు లబ్ధిదారులందరినీ ఫేషియల్ రిజిస్ట్రేషన్ నమోదు చేయించాలని చెప్పడం, దీనికి యాప్‌ని తీసుకురావడం సరికాదని హితవుపలికారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త కొత్త యాప్‌లను తీసుకొస్తూ అంగన్వాడీ కార్యకర్తలకు ట్రైనింగ్ ఇవ్వకుండా, ఆన్‌లైన్ పనులు చేయాలని ఒత్తిడి చేయడంతో వారు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పని ఒత్తిడి కారణంగా అంగన్వాడీలు శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడుతూ బీపీ, షుగర్ వ్యాధులకు గురవుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం అంగన్వాడీలపై పనిభారాన్ని తగ్గించాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్‌ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని సిడిపిఓ విజయ్‌గౌరి అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు వై.దుర్గ, జయ, వెంకటరమణ, వసంత, పార్వతి, నూకరత్నం, పి.దుర్గ, పొద్దమ్మ, శేషమ్మ, ఝాన్సీ, వీరమ్మ, కిట్టమ్మ, త్రివేణి, చిట్టెమ్మ, విజయ, సరోజిని, రమణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న క్రైస్తవులు

మణిపూర్ ఘటనలపై ర్యాలీ

ప్రజాశక్తి -అనంతగిరి: మణిపూర్‌లో విధ్వంస పరిస్థితులు చక్కబర్చి, సాధారణ ప్రజా జీవన పరిస్థితులు నెలకొల్పాలని అనంతగిరిలో సోమవారం క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ మూడు రోడ్ల మీదుగా వారపు సంత బొడ్డచెట్టు కొలని వరకు సాగింది. ఈ సందర్భంగా అనంతగిరి పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు యస్.జె.కుమార్ పీటర్, జోషఫ్. నీలయ్య, డేవిడ్ పాల్ . మాట్లాడుతూ, మణిపూర్‌లో గిరిజనులపై జరుగుతున్న అమానుష చర్యలను ఆ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆపలేక పోయాయన్నారు.ఈ ర్యాలీకి అరకు లోయకు చెందిన ఐక్యవేదిక ప్రతినిధులు బురిడీ. ఆనందరావు, ఓలేసి .బాబురావు, రావులపల్లి. రవి, సీపీఎం నాయకులు నేతలు తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

పనసపుట్టులో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని లైలాండ్ పంచాయతీ పనసపొట్టు గ్రామంలో కనీస మౌలిక సౌకర్యాలైన సిసి రోడ్లు, వీధి కాలువలు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని ఏపీ కాంగ్రెస్ పార్టీ ఆదివాసి రాష్ట్ర చైర్ పర్సన్ పాచిపెంట శాంత కుమారి డిమాండ్ చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామంలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశాలల వసతి గృహాల్లో హెల్త్ వాలంటీర్లను నియమించి, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని అమలు చేయాలన్నారు. జీవో 3ను పునరుద్ధరించి, ఎస్టి సబ్ ప్లాన్ నిధులు గిరిజనులకే ఖర్చు చేయడం డిమాండ్ చేశారు. గిరిజన హక్కులు చట్టాలు అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. గిరిజనుల వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఆదివాసి రాష్ట్ర కోఆర్డినేటర్ టి సోమేశ్వరరావు, పిసిసి సభ్యుడు పి.చిన్నస్వామి, మండల అధ్యక్షుడు కే.జగన్నాథం, నాయకులు పరశురాం, రాజబాబు, మాజీ ఎంపిటిసి ఆర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేపడుతున్న కాంగ్రెస్ నేతలు

అసంపూర్తి వంతెనతో అవస్థలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: అసంపూర్తిగా ఉన్న కొర్రాయి వంతెనను వెంటనే పూర్తి చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్చార్జ్ సుజాత సల్మాన్ డిమాండ్ చేశారు. అసంపూర్తి వంతెనను సోమవారం ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వంతెన అసంపూర్తిగా ఉండటంతో రాకపోకలకు వాహనదారులు, ఆ ప్రాంత గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి వంతెనను పూర్తి చేసి గిరిజనులకు ఇబ్బంది కలకుండా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కార్యకర్తలు, గిరిజనులు పాల్గొన్నారు.

యుఇఇయులో ఎపి జెన్‌కో కాంట్రాక్టు కార్మికుల చేరిక

ప్రజాశక్తి-మోతుగూడెం

అల్లూరి సీతారామరాజు జిల్లా డొంకరాయిలోని ఎపి జెన్‌కోలో పనిచేస్తున్న 41 మంది కాంట్రాక్ట్ కార్మికులు యునైటెడ్ ఎలక్ట్రసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యుఇఇయు) (సిఐటియు)లో చేరారు. వారికి యుఇఇయు రాష్ట్ర కమిటీ సభ్యులు చింతా రాంబాబు, రీజనల్ సెక్రటరీ జె.రత్నాకర్, కోశాధికారి బివి.రమణ సమక్షంలో సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా చింతా రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ఎపి జెన్‌కో యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా, వారి చేత వెట్టి చాకిరీ చేయించుకుంటున్నాయని విమర్శించారు. సంవత్సరాల తరబడి పని చేసినా పర్మినెంట్ చేయడం లేదని, కనీస వేతనాలు ఇవ్వమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా యాజమాన్యం అమలు చేయడం లేదని పేర్కొన్నారు. కొన్ని కార్మిక సంఘాల నాయకులు తమ స్వార్థం, అవసరాల కోసం కార్మికులను వాడుకొని చివరికి మొండి చేయి చూపించారని విమర్శించారు. గత ప్రభుత్వాలతో పోల్చిచూస్తే ప్రస్తుత ప్రభుత్వం కార్మిక వర్గాన్ని మరింత హీనంగా చూస్తుందన్నారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని గత ఎన్నికల ముందు వాగ్దానం చేసిన వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మాట తప్పారని విమర్శించారు. రీజనల్ సెక్రటరీ జె.రత్నాకర్ మాట్లాడుతూ, విద్యుత్ కార్మికుల సమస్యలపై విద్యుత్ ఉద్యోగుల జెఎసి కమిటీ ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో పూర్తిగా విఫలమైనదని, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల మీద కనీసం చర్చించలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కార్మికులు సమస్యలను త్వరగా పరిష్కారం చేయాలన్నారు. కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికుల సమస్యల మీద ఈ నెల 17న నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న యుఇఇయు నాయకులు

మణిపూర్ వాసులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-చింతూరు

మణిపూర్ రాష్ట్రంలో గిరిజనులపై జరిగిన దాడులకు నిరసనగా చింతూరు డివిజన్ కేంద్రంలో డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, శాంతి భద్రతలు పరిరక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం నాలుగు మండలాల అధికారులకు పాస్టర్స్ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పాస్టర్స్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ కాల్పులు, ఇళ్లు, చర్చిలు తగలబెట్టడం వంటి హింసాత్మక సంఘటనలు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రత్యేకించి మే 3న మణిపూర్ రాష్ట్రంలో జరిగిన సంఘటన చాలా దారుణమన్నారు. అక్కడ మతచాందసవాదులు, ప్రభుత్వం చర్యలు కారణంగా 66వేల మంది పైబడి ప్రజలు శరణార్ధ శిబిరాల్లో ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి అవసరాలైన ఆహారం, బట్టలు, దుప్పట్లు, వసతి వంటి సౌకర్యాలు లేవని, తల్లి, పిల్లలు, వృద్ధులు అనారోగ్యంతో బాధపడుతున్నారని, వారికి ఆహారం, వైద్య సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతూరు డివిజన్ పరిధిలోని పాస్టర్లు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు, క్రిస్టియన్ సంఘ సభ్యులు



వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

ఉప్పలపాడులో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి-అడ్డతీగల

మండలంలోని మట్లపాడు పంచాయతీ పరిధి ఉప్పలపాడు గ్రామంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ గ్రామంలో 40 కుటుంబాలు నివసిస్తుండగా, సుమారు 30 కుటుంబాల వారికి కాళ్లు, చేతులు, నడుము భాగాలు పట్లు వచ్చి మంచాలకు పరిమితమయ్యారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందగా, విషయం తెలుసుకున్న ఎడిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్, ఎంపీడీవో కె.బాపన్న దొర చొరవ చూపి సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు రక్త పరీక్షలు చేశారు. సచివాలయం సిబ్బంది గ్రామ పురవీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రస్తుతం గ్రామంలో నెలకొన్న పరిస్థితికి కారణం ఏమిటో త్వరలో తెలియనుందని, అవసరమైతే మరికొన్ని రోజులు ఆ గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని డాక్టర్ భాస్కర్ తెలిపారు.

వాగులో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి-అడ్డతీగల

మండలంలోని ఎల్లవరం పంచాయతీ పరిధి ఎల్లవరం గ్రామానికి చెందిన సంపత్ చిట్టిబాబు (35) స్థానిక మడేరు వాగులో ప్రమాదవశాస్తు పడి మృతి చెందారు. విఆర్ఒ మురళి, పోలీసుల కథనం ప్రకారం... ఎల్లవరం విఆర్ఎగా పని చేస్తున్న చిన్నారావు కుమారుడు చిట్టిబాబు ప్రమాదవశాత్తు మడేరు వాగులో పడిపోయారు. ఈ విషయం తెలుసుకున్న అడ్డతీగల ఎస్సై అప్పలరాజు సిబ్బందితో కలిసి వాగు పరివాహక ప్రాంతంలో గాలించారు. ఎల్లవరం కొత్తపాలెం గ్రామాల మధ్య చిట్టిబాబు మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకొచ్చి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. చిట్టిబాబు మృతితో చిన్నారావు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నేరుగా విలపించారు. తహశీల్దార్ తాతారావు, రెవెన్యూ సిబ్బంది చిన్నారావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎస్ఐ అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని ఒడ్డుకు తెచ్చిన దృశ్యం

'స్పందన'కు 45 దరఖాస్తులు



వినతులు స్వీకరిస్తున్న పిఒ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

ప్రజాశక్తి - రంపచోడవరం : స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 45దరఖాస్తులు వచ్చాయి. రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్ పాల్గొని, ఏజెన్సీలోని మారుమూల గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు నివేదించి, సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు పిఒ సూరజ్‌గనోరే వెల్లడించారు.కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డిఎస్ శాస్త్రి, ఇఇలు జి. డేవిడ్‌రాజ్, ఎండి యూసఫ్, కె. సుబ్బయ్య, డాక్టర్ ఒబి ఇందిర, ఎడిఎంహెచ్ఒ డాక్టర్. జి భాస్కర్, పిహెచ్ఒ కె.చిట్టిబాబు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్‌కెవి చౌదరి, తహశీల్దార్ పివివి.జయకుమార్ ఎంపిడిఒ హరికృష్ణ, డిఇఇలు ఎ.వెంకటేశ్వరరావు, రామచంద్రమూర్తి, సాయిసతీష్, రాజేంద్ర బాబు, డి శ్రీనివాసరావు, శ్రీనివాస్, డివిజనల్ పౌరసరఫరాల అధికారి సి. శ్రీహరి, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె.కోటేశ్వరరావు, జిసిసి సీనియర్ మేనేజర్ ముర్ల నాగ వెంకట రాజారెడ్డి, సిడిపిఒ సంధ్యారాణి, మత్స్యశాఖ అధికారి రమేష్, ఎస్ఒలు వారాత్రి కబోది, చేకూరి మార్తమ్మ పాల్గొన్నారు.

పలు సమస్యలపై వినతి

మారేడుమిల్లి : మండలంలోని బొడ్డుమానువీధిలో చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టి, 21 గిరిజన కుటుంబాల రైతుల పొలాలకు సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని చావిడికోట సర్పంచ్ ప్రేమ్‌కుమార్‌రెడ్డి స్పందనలో విన్నవించారు. ఆకు మామిడికోట నుండి పాతకోట వరకు రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఈ మార్గంలో ప్రయాణానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా గర్భిణులు,బాలింతలు, రోగులు అవస్థలు పడే పరిస్థితి ఉందని విన్నవించారు. తక్షణమే అధ్వానరోడ్లను బాగుచేయించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు డాక్టర్ పల్లల రాజ్‌కుమార్ రెడ్డి, గుర్తేడు సర్పంచ్ గొర్లె దుష్యం పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిపించండి

మారేడుమిల్లి : విద్యా సంవత్సరం ప్రారంభమై, మూడు నెలలు కావస్తున్నా చావిడికోట పంచాయతీ పరిధిలోని పలుగ్రామాల్లో ఉన్న ఐటిడిఎ యాజమాన్యంలోని జిపిఎస్ పాఠశాలలు ఇంకా తెరుచుకోలేదని ఆ గ్రామ సర్పంచ్ సాదల ప్రేమ్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఐటిడిఎ స్పందనలో పిఒ సూరజ్ గనోరేను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఐటిడిఎ యాజమాన్యంలోని ముంతమామిడి, చావిడికోట, తేనె మామిడి, కొత్త వీధి, తుర్రవాడతో పాటు మరో నాలుగు జిపిఎస్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక నేటికీ తెరుచుకోని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల తెరిచే దిక్కు లేని స్థితిలో చదువు కోవాల్సిన గిరిజన బాలబాలికలు పలుగుపార పట్టుకుని, తమ తల్లిదండ్రులతో కొండపోడు సాగుకు వెళ్లిపోతున్నారని, తద్వారా వారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాల్సిన అధికార యంత్రాంగం, ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకుండా చేసి, వారి చదువుకు దూరం చేయడం రాజ్యాంగపరంగా నేరమని, ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు చేపట్టాలని వేడుకున్నారు.

పలు గ్రామాల్లో 'నా భూమి - నా దేశం'



నడిమిడిలో స్వాతంత్ర్య అమరవీరులకు నివాళులర్పిస్తున్న సర్పంచ్ బొజ్జయ్య

ప్రజాశక్తి - రంపచోడవరం : ఆజాదీ కా అమృత్‌మహోత్సవ్‌లో భాగంగా నడిమిడిలో నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మంగా బొజ్జయ్య ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరంలో, దేశ రక్షణలో అసువులు బాసిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. పర్యావరణ హిత సమాజాన్ని నిర్మించాలని ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం చెరువుగట్టు వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయితీ అధికారి జిఎల్‌ఎన్‌వి.రాఘవన్, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కోటేశ్వరరావు, ఎపిఎన్‌ఆర్‌జిఎస్ ఎపిఒ ఎ.సాయిబాబా, పంచాయితీ కార్యదర్శి ఎస్.రమేష్ , సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

మాడగడలో 'నా భూమి నా దేశం'

అరకులోయ రూరల్ : మండలంలోని మాడగడలో నాభూమి నా దేశం, వీరులకు వందనం అనే కార్యక్రమాన్ని సర్పంచ్ జ్యోతి ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కుల మత వర్గ భేదాలు లేకుండా భారతీయులందరూ కలిసి మెలసి జీవించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బాబూరావు, సచివాలయం కార్యదర్శులు రాజబాబు, చిట్టిబాబు పాల్గొన్నారు



మాడగడ పిహెచ్‌సి ఆవరణలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ జ్యోతి

జూనియర్ సివిల్ జడ్జిగా ఎయు విద్యార్థి

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం న్యాయ కళాశాలకు చెందిన మజ్జి వంశీకృష్ణ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఎయు వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో సోమవారం వంశీకృష్ణను అభినందించారు. అతిపిన్న వయస్సులో, తొలి ప్రయత్నంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం పట్ల వీసీ హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత నేపథ్యం నుంచి వచ్చి, ఉన్నత ఆశయంతో ఎదగడం సంతోషమన్నారు. ఏయూ విద్యార్థులు అత్యున్నత స్థానాలను అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎయు న్యాయ కళాశాల ఆచార్యులు కె.సీతామాణిక్యం, ప్లేస్‌మెంట్ అధికారి, విఆర్.రెడ్డి పాల్గొన్నారు.

ఎయు ప్రగతి ఆనందాన్నిస్తోంది

- యూనివర్సిటీ ఆఫ్ కాన్సాస్ డైరెక్టర్ అశ్వినికుమార్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రగతి అమితమైన ఆనందాన్నిస్తోందని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాన్సాస్ టెక్నాలజీ లైసెన్సింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.అశ్వినికుమార్ అన్నారు. సోమవారం ఆయన ఎయును సందర్శించారు. ఈ సందర్భంగా తాను చదువుకున్న హ్యూమన్ జెనిటిక్స్ విభాగం, ఐపిఆర్ సెంటర్లను సందర్శించారు. అనంతరం వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఐపి, స్టార్టప్ రంగాలలో ఏయూ సాధించిన అభ్యున్నతిని ప్రశంసించారు. కార్యక్రమంలో ఆచార్య పద్దయ్య, డాక్టర్ హనుమంతు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ తరపున అశ్వినికుమార్‌ను వీసీ సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.

భూ రికార్డుల తారుమారుపై

న్యాయం చేయాలని గిరిజనుల ధర్నా

రొంపల్లి పంచాయతీ నాన్‌షెడ్యూల్డ్ గ్రామాల ఆదివాసీల ఆందోళన



ధర్నా చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి- అనంతగిరి : రికార్డులను తారుమారు చేసి, తరాలుగా ఏళ్లబడి తమ సాగులో ఉన్న భూములను రెవెన్యూ అధికారుల అండదండలతో గిరిజనేతరులైన రియల్టర్లు లాక్కొంటున్నారని మండంలోని రొంపలి పంచాయతీ చిన్నకోనెల, బూరిగ గ్రామాల ఆదివాసీ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఈ మేరకు గిరిజనేతరుల నుంచి తమను, తమ భూములకు రక్షణ కల్పించాలని వేడుకుంటూ ధర్నా చేశారు.

ఈ సందర్భంగా బూరిగ పెంటయ్య. కోనపర్తి సింహాచలం, సోముల అప్పలరాజు మాట్లాడుతూ, .అనంతగిరి మండలంలోని రొంపలి పంచాయతీ బూరిగ, చిన్నకోనెల రెవెన్యూ పరిధిలో 80 కుటుంబాల ఆదివాసీ గిరిజనులు సర్వేనెంబరు1,2,3, 11 వరకు 90 ఎకరాల జిరాయితీ భూమిని ఏళ్లతరబడి సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వంశపారంపర్యంగా తమ వారసులకు చెందాల్సిన ఈ భూములను స్థానికేతర గిరిజనేతరులు, రియల్టర్లు తమవంటూ అడంగలు, రెవెన్యూ రికార్డుల్లో మార్పుచేసి, తహశీల్దార్, ఇతర రెవెన్యూ అధికారుల సహకారంతో పట్టాదారు పాసు పుస్తకాలను కూడా సిద్ధం చేసి లాక్కొంటున్నారని సాగుదారులైన ఆదివాసీగిరిజనులు ఆవేదన చెందుతున్నారు.
1 నాన్‌షెడ్యూల్ గ్రామాలు కావడంతో ఆర్ఒఎఫ్ఆర్ చట్టాలున్నా వాటిని తుంగలో తొక్కి సాగుదారులు, నిజమైన గిరిజనులైన తమను అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సాగులో ఉన్న భూములకు గిరిజనేతరులకు ఎలా పట్టాలు ఇచ్చారో అంతుపట్టడం లేదని, దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి, తమ గ్రామాన్ని సందర్శించాలని, సంబంధిత అధికారులతో సర్వే సమగ్ర విచారణ జరిపించి, తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. అలాగే నాన్‌షెడ్యూల్డ్ గ్రామాలుగా ఉన్న తమను షెడ్యూల్డ్ గిరిజనులు గుర్తించాలని వేడుకుంటున్నారు.

వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం

మూడు స్థానాల్లో సిపిఎం, ఒకచోట టిడిపి అభ్యర్థి ఎన్నిక



అనంతగిరిలో విజయోత్సాహంలో సిపిఎం నేతలు, కార్యకర్తలు

అనంతగిరి ఏడో వార్డు సభ్యునిగా సిపిఎం అభ్యర్థి చిన్నయ్య

ప్రజాశక్తి - అనంతగిరి : అనంతగిరి పంచాయతీ ఏడవ. వార్డుకు నిర్వహించిన ఉపఎన్నికల్లో సిపిఎం బలపరిచిన అభ్యర్థి బాడ్నయిన్న చిన్నయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాంగి అప్పన్న అకాల మరణంతో జరిగిన ఉప ఎన్నికలో సిపిఎం తరపు బి.చిన్నయ్య, టిడిపి బలపరిచిన పాంగి గంగరాజు నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ, టిడిపి అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకోవడంతో సిపిఎం బలపరిచిన అభ్యర్థి చిన్నయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి లక్ష్మీనారాయణ ప్రకటించి, ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. చిన్నయ్య ఏకగ్రీవ ఎన్నికపై సిపిఎమ్‌కు చెందిన సర్పంచ్ సొమ్మెల రూతు, ఇతర వార్డు సభ్యులు, పార్టీ నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సొమ్మెల నాగులు ఉన్నారు.

టి.పెంటవీడు ఐదవ వార్డు సభ్యురాలిగా సిపిఎం మణికుమారి



ఎటపాక: త్రిపుర పెంటవీడు పంచాయతీ ఐదవ వార్డుకు జరిగిన ఉప ఎన్నికలో సిపిఎం బలపరిచిన అభ్యర్థి గద్దల మణికుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. త్రిపుర పెంటవీడు ఉపసర్పంచ్ గద్దల వసంత్ ప్రమాదవశాత్తు మరణించగా, ఖాళీ అయిన ఆ స్థానంలో ఉప ఎన్నికకు ప్రభుత్వ నోటిఫికేషన్ జారీ చేసింది. నిర్ధేశిత గడువులోగా నామినేషన్ల ఉపసంహరణ అనంతరం గద్దల వసంత్ భార్య గద్దల మణికుమారి ఒక్కరే పోటీలో ఉండటంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

జీడిగుప్ప ఏడో వార్డు సభ్యురాలిగా సిపిఎం వరలక్ష్మి

విఆర్.పురం: మండలంలోని జీడిగుప్ప గ్రామపంచాయతీలో ఏడవ వార్డు స్థానానికి సోమవారం నిర్వహించిన ఉప ఎన్నికల్లో సిపిఎం బలపరిచిన కటకాల వరలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ మేరకు ఆమెకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని ఎన్నికల అధికారి రామకృష్ణారెడ్డి అందజేశారు ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ, తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న వార్డు సభ్యులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి తాను శాయశక్తులా కృషి చేస్తానని వెల్లడించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

మర్రివాడ నాలుగో వార్డు సభ్యురాలిగా టిడిపి అభ్యర్థి చెల్లమ్మ

రంపచోడవరం : మండలంలో మర్రివాడ పంచాయతీ నాలుగో వార్డు స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఎర్రగొండ చెల్లమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కారం వీర వెంకట సత్యనారాయణ దొర తెలిపారు. ఎన్నికైన అభ్యర్థి చెల్లమ్మకు ధ్రువీకరణ పత్రాన్ని ఎన్నికల అధికారి అందజేశారు. మర్రివాడ, ఆకూరు పంచాయతీల్లో చనిపోయిన వార్డు సభ్యుల స్థానాల్లో ఉప ఎన్నికల నిర్వహించగా, మర్రివాడలో ఏకగ్రీవం కాగా, బందపల్లి ఎనిమిదో వార్డులో మాత్రం ద్విముఖ పోటీ నెలకొంది. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు ఎర్రగొండ రాజారావు, బూత్ కమిటీ సభ్యులు పారా వెంకన్న పాల్గొన్నారు.


ఎటపాక, విఆర్.పురం, రంపచోడవరంలలో ఎన్నికల ధ్రువీకరణ పత్రాలను స్వీకరిస్తున్న గెలుపొందిన అభ్యర్థులు

పెద కోడాపల్లి సర్పంచ్ బరిలో ఐదుగురు



మాట్లాడుతున్న ఎంపిడిఒ పూర్ణయ్య

పెదబయలు : ఈనెల 19న జరగనున్న పంచాయతీ ఉప ఎన్నికలకు సంబంధించి పెద కోడాపల్లి సర్పంచ్ స్థానానికి, అలాగే ఇంజరి పంచాయతీ పరిధిలోని ఎనిమిది వార్డు స్థానాలకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పెదకోడాపల్లి సర్పంచ్ బరిలో ఐదుగురు అభ్యర్థులు పోటీ బరిలో ఉన్నారని ఎంపిడిఒ ఎల్.పూర్ణయ్య తెలిపారు. పెదకోడాపల్లి సర్పంచ్ స్థానానికి ఎనిమిది నామినేషన్లు దాఖలు కాగా, ముగ్గురు ఉపసంహరించుకున్నారని, దీంతో ఐదుగురు పోటీలో నిలిచారన్నారు. పోటీలో నిలిచిన వారిలో బోండాపుట్టు గ్రామానికి చెందిన ఆర్మా కోటిబాబు, బురదమామిడికి చెందిన పాంగి పుల్లయ్య, పెదకోడాపల్లికి చెందిన పాంగి ప్రసాద్, చిట్టిబాబు, బంగారుపుట్టు గ్రామానికి చెందిన సెగ్గే చిన్నతల్లి ఉన్నారన్నారు. బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు.
అలాగే ఇంజరి పంచాయతీలో ఎనిమిది వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని నోటిఫికేషన్ జారీ చేయగా, ఆరు వార్డులకు 11మంది నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో ఒక నామినేషన్ తిరస్కరించారు. దీంతో ఈ పంచాయతీలో వార్డుస్థానాలకు ఎన్నిక అనివార్యమైంది. కార్యక్రమంలో ఎంఇఒ కొమ్ము కృష్ణమూర్తి, ఇఒపిఆర్‌డి పి.నర్సింగరావు ఉన్నారు.

సీలేరులో 'హర్ ఘర్ తిరంగా'



సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యాన జాతీయ జెండాలతో ర్యాలీలో విద్యార్థులు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరులో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని సోమవారం సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి సీలేరు ఎపి జెన్‌కో కాలనీ ప్రధాన రహదారి గుండా పోస్టాఫీస్, రామాలయం మీదుగా విద్యార్థులు మువ్వన్నెల జాతీయ జెండాలను పట్టుకుని, రెపరెపలాడిస్తూ, భారత్ మాతాకీ జై, స్వతంత్ర భారత్‌కీ జై నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ సెంటర్‌కు చేరుకుని అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు.
ఈ సందర్భంగా సిఆర్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, స్థానిక ఎస్ఐ రామకృష్ణ, ఎంపిటిసి పిల్లా. సాంబమూర్తి, డిఎవి ప్రధానోపాధ్యాయులు రామచంద్రరావు మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి, 76 ఏళ్లుపూర్తి చేసుకుని, 77వ ఏటలోకి అడుగిడుతున్న సందర్భంలోఇంటింటా జాతీయ జెండాను ఎగరేసి, భారతదేశ ఖ్యాతిని తెలియజేయాలన్నారు స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన నేతల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. దేశభద్రతకు సరిహద్దుల్లో రక్షణగా ఉన్న జవాన్ల త్యాగాలను, స్ఫూర్తిని తెలియజెప్పాలన్నారు. జాతీయజెండాకు వందనం చేసి, దాని గౌరవాన్ని కాపాడేందుకు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో డిఎవి జిల్లా పరిషత్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సాయిరాం, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల మాక్‌డ్రిల్

విఆర్.పురం: 77 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులు సోమవారం ముందస్తుగా రిహార్సల్స్ నిర్వహించారు. హైస్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో మాక్‌డ్రిల్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు విద్యార్థులంతా క్రమశిక్షణతో సిద్ధం కావాలని హెచ్ఎం బాబూరావు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రిహార్సల్స్ చేస్తున్న విద్యార్థులు

పివిటిజిల సమస్యల పరిష్కారానికి

18న 'చలో ఐటిడిఎ'కు తరలిరండి



ఆందోళన చేస్తున్న ఆదివాసీ గిరిజనులు

1ప్రజాశక్తి- జి. మాడుగుల : పివిటిజిల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18న ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో ఐటిడిఎ ఆందోళనను విజయవంతం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని గెమ్మెలి పంచాయతీ, కె.పెద్దబయలు గ్రామంలో నిర్వహించిన సమావేశంలో పివిటిజి గ్రామాలకు 2023-25 బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం రూ.15 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించినా, పాడేరు ఐటిడిఎ పరిధిలోని పివిటిజి గ్రామాలకు పైసా నిధులు చేరలేదన్నారు. పివిటిజిలకు కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేయాలని, నిరుపేదలకు నెలసరి 35కిలోలు ఇచ్చే అంత్యోదయ కార్డులను పునరుద్ధరించాలని, సిసిడిపి నిధులతో పివిటిజి గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, అంగన్వాడీ, సామాజిక భవనాలు, ఇతరత్రా మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని, 45 ఏళ్లు దాటిన పివిటిజిలకు పెన్షన్ మంజూరు చేయాలని, వీరికి గృహ నిర్మాణానికి రూ.ఐదు లక్షలు కేటాయించాలని, ఇప్పటివరకు పివిటిజిలు తీసుకున్న రుణాలను మాఫీ చేసి వాటిని రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్లతో ఈనెల 18న చలో ఐటిడిఎ ఆందోళనకు పివిటిజి గిరిజనులంతా పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వంతల సన్యాసయ్య, మర్రి అప్పారావు, తాబేలు. సూరిబాబు, పాంగి యోసేబు, గ్రామస్తులు పాల్గొన్నారు

తమ్మన్న దొర సంస్మరణ సభ



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ స్వామి దొర

ప్రజాశక్తి -రంపచోడవరం : మండలంలోని బందపల్లిలో సర్పంచ్ కారం స్వామిదొర ఆధ్వర్యంలో కారం తమ్మన్న దొర సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి దొర మాట్లాడుతూ బ్రిటీష్ అధికారుల ప్రోద్బలంతో గిరిజనులపై అనేక రకాల పన్నులు విధించిన నాటిరోజుల్లో తమ్మన్నదొర నాయకత్వంలో మన్యవాసులు తిరుగుబాటు చేశారన్నారు. ఈ ఉద్యమమే తదనంతరం విశాఖ, భద్రాచలం, రేకపల్లి, చోడవరం మొదలైన ప్రాంతాలకు విస్తరించిందన్నారు. 1880లో సైనిక బలంతో బ్రిటీషర్లు ఈ తిరుగుబాటును అణచివేసినా, వీరోచిత ఈ పోరాటం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. గిరిజనులు పోరాటం చరిత్రను నేటితరం విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. అనంతరం తమ్మన్నదొర కుటుంబీకులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు కొంచెం వంశీ, సాయిబాబా, కారం తమన్నదొర కుటుంబ సభ్యులు, ఆదివాసీ జెఎసి వైస్‌చైర్మన్ తెల్లం శేఖర్, మడకం బంగారుబాబు, అయినాపురపు సూర్యనారాయణ, సున్నం వెంకటరమణ పాల్గొన్నారు.

వేళాపాళా లేని విద్యుత్ కోతలతో అవస్థలు

ప్రజాశక్తి- పెదబయలు : వేళాపాళాలేని విద్యుత్ కోతలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ప్రజాసంఘాల నాయకుడు కొమ్మ పృథ్వీరాజ్ ఆరోపించారు. మండల కేంద్రంలోనే ఇష్టారాజ్యంగా విద్యుత్ కోతలు ఉంటే, ఇక మారుమూల కొండప్రాంత గ్రామాల్లో ఇంకెంత దారుణంగా ఉంటుందో ఇట్టే అర్థమౌతోందన్నారు. విద్యుత్ కోతలపై సంబంధిత అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

గడిచిన నాలుగున్నరేళ్లలో దాదాపు పదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన ప్రభుత్వం, నాణ్యమైన కోతల్లేని విద్యుత్ సరఫరాచేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.ఇష్టానుసారంగా ఉన్న విద్యుత్ కోతలతో ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపారులతోపాటు సామాన్య గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్ కోతలతో హాస్పిటల్స్‌లో డీప్ రిఫ్రిజిరేటర్‌లో ఉన్న వ్యాక్సిన్లు, ఇతర మందులుతోపాటు పాఠశాలలు, హాస్టల్స్‌లో ఫ్రీజు చేసిన వస్తువులు పాడౌతున్నాయని ఆరోపించారు .అంతేకాక వచ్చిపోయే కరెంటుతో విద్యుత్ గృహోపకరణాలు పాడౌతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు.

200 యూనిట్ల వినియోగం వరకు పేదలకు ఉచిత విద్యుత్‌ను అందజేస్తామని హామీనిచ్చిన సిఎం జగన్, ఉచిత విద్యుత్ హామీని అమలు చేయకపోగా, ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలంటూ పదేళ్ల క్రితం వాడిన విద్యుత్‌కు కూడా ఇపుడు అదనపు బిల్లులు వేసి నిరుపేద, సామాన్య వినియోగదారులపైనా మోయలేని ఛార్జీల భారాన్ని మోపి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, విద్యుత్ కోతలను ఎత్తేయడంతోపాటు, నాణ్యమైన విద్యుత్ సరఫరాచేయాలని, వినియోగదారులపై ట్రూఅప్, సర్దుబాటు పేరుతో వేసిన అదనపు భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు తక్షణం స్పందించకుంటే, సబ్‌స్టేషన్ల ముట్టడి, ధర్నా చేయనున్నట్లు హెచ్చరించారు.

సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ



సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సరోజిని

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి అంగన్వాడీ కేంద్రంలో వైయస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లను స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని, అంగన్వాడీ టీచర్ మల్లమ్మ, సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ చేతుల మీదుగా సోమవారం గర్భిణులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాలని, కూరగాయలు, ఆకుకూరలు, పాలు వంటి బలమైన ఆహారం తినాలని సూచించారు. ఎప్పటికప్పుడు హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు. హెల్త్ వర్కర్ సుజాత, గర్భిణులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మత్స్యగెడ్డలో కొట్టుకుపోయిన మహిళ మృతి

ప్రజాశక్తి-పెదబయలు : స్థానిక మత్స్యగెడ్డలో అరడకోట పంచాయతీకి చెందిన పాంగి సీతమ్మ (46) అనే మహిళ ప్రమాదవశాత్తు కొట్టుకుపోయి మృతి చెందినట్లు ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. మత్స్యగెడ్డ దాతుతూ సీతమ్మ కొట్టుకుపోగా, సీతగుంట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామ సమీపంలో మృతదేహం లభ్యమైందన్నారు. మృతదేహానికి కుటుంబసభ్యుల సమక్షంలో శవపంచనామా నిర్వహించి, అనంతరం దహన సంస్కారాలు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ పి మాధవరావు, ఉపసర్పంచ్ బోండా గంగాధరం ఉన్నారు.